కథ

పులిపాక కనకదుర్గ

"నేహా! ఐ లవ్ యూ!" చెప్పాడు సుహాస్.

"నా వయసు ఎంతనుకుంటున్నావు?" సుహాస్ వంకే ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది నేహా.

"జలతారులాంటి పదహారు" భుజాలను ష్రగ్ చేస్తూ కాన్ఫిడెంట్‌గా చెప్పాడు సుహాస్.

"కరెక్టే! నువ్వు నాకంటే మూడేళ్లు సీనియర్‌వి. అంటే నీది కూడా టీనేజే. అప్పుడే మనకు ప్రేమ కావాల్సి వచ్చిందా?" మరింత ఆశ్చర్యంగా అంది నేహా. అమాయకురాలిని చూసినట్టు చూశాడు సుహాస్, నేహను.

"ఈ వయసులో కాకపోతే ఇంకెప్పుడు ప్రేమించాలి?"

విడ్డూరంగా ప్రశ్నిస్తున్న సుహాస్‌ని పరిశీలనగా చూసింది నేహా. బూడిదరంగు జీన్స్ మీద 'హగ్ మీ' అన్న అక్షరాలున్న టీ షర్ట్ వేసుకున్నాడు. తిరగటానికి బైక్, సెల్ ఫోన్. పర్స్‌నిండా డబ్బుతో జల్సాగా ఉన్నాడు. నేహ తనను కాదనదన్న ధీమా అతనిలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.

"అయాం సారీ! నేను నిన్ను ప్రేమించటం లేదు" నిష్కర్షగా చెప్పింది నేహా.

"వాట్?" అదిరిపడ్డాడు సుహాస్.

"కమ్ ఎగైన్" తను విన్నది కరెక్టేనా అన్న సందేహం స్పష్టంగా కనిపించింది అతని ప్రశ్నలో.

"నువ్వు సరిగ్గానే విన్నావు సుహాస్. నేను నిన్ను ప్రేమించటం లేదు"

"అదే ఎందుకని?" గట్టిగా అడిగేడు.

"ఎందుకో నీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు" విసురుగా అంది నేహా.

నేహ ధోరణి వింతగా తోచింది సుహాస్‌కి.

"నీకు నేనంటే ఇష్టం లేదా? లేక ప్రేమంటేనే ఇష్టం లేదా?" అంతటితో వదలకుండా రెట్టించాడు.

చిరాగ్గా చూసింది నేహా.

"నా మనసులో ప్రేమ అనే ఆలోచనకు స్థానమే లేదు. మా అమ్మా నాన్నా నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల ఆశయం నెరవేర్చడమే నా జీవిత ధ్యేయం. ఎప్పుడూ నా దగ్గర ఈ టాపిక్ తేవద్దు" చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పేసి చరచరా వెళ్లిపోయింది నేహా.

తేలిగ్గా నిట్టూర్చాడు సుహాస్. 'నేహకు ప్రేమపట్ల విముఖత ఉంది కానీ తనపట్ల ఎలాంటి విముఖతా లేదు'

అందుకే చాటుగా ఉండి గమనిస్తున్న ఫ్రెండ్స్ దగ్గరకు వచ్చి చెప్పేడు. "ఈరోజు కాకపోయినా రేపయినా నేహ నా ప్రేమను అంగీకరిస్తుంది"

"అంటే ఇప్పుడు నో చెప్పిందనేగా అర్థం" రెచ్చగొట్టినట్టుగా అన్నాడు రాహుల్.

ఫ్రెండ్స్ ముందర చాలా అవమానంగా ఫీలయ్యేడు సుహాస్.

'నేహా! నన్ను ప్రేమించేవరకూ నిన్ను వదలను' ఆ క్షణమే మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు.

సీనియర్ ఇంటర్ చదువుతున్న నేహను మొదటిసారి ఓ బర్త్‌డే పార్టీలో చూశాడు సుహాస్.

సింపుల్‌గా ఉన్నా, పార్టీలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌లా ఉన్న ఆమెను చూడగానే మనసు పారేసుకున్నాడు సుహాస్.

ఫ్రెండ్స్ సహాయంతో ఆమె వివరాలన్నీ సేకరించాడు.

నేహ తండ్రి బ్యాంక్ మేనేజర్ అనీ, నేహ కాక ఆయనకు మరొక అమ్మాయి కూడా ఉందని తెలుసుకున్నాడు.

మిడిల్ క్లాసుకు చెందిన నేహ తనలాంటి డబ్బున్న అబ్బాయిని ఎగిరిగంతేసి మరీ ప్రేమిస్తుందన్న నమ్మకం కలిగింది సుహాస్‌కు.

ఆ నమ్మకంతోనే నేహతో కావాలని పరిచయం పెంచుకున్నాడు. ఆమె అభిరుచులని, అలవాట్లని తెలుసుకున్నాడు.

# ప్రేమంటే?

"ఎంతకాలం ఇలా ఉత్త స్నేహం. నీ ప్రేమను ఆమెకు తెలియజెయ్యి" అన్న ఫ్రెండ్స్ ప్రోద్బలం మీద నేహను ఒంటరిగా కలిసి తన ప్రేమను వెల్లడి చేశాడు.

అంతవరకూ సుహాస్ మనసులో అభిప్రాయం తెలియని నేహ ముందు ఆశ్చర్యపోయింది. తరువాత అతని ప్రేమను తిరస్కరించింది.

నేహ తిరస్కారం సుహాస్ పట్టుదలను మరింత పెంచింది. తన పంతమే ప్రేమ అన్న భ్రమలో ఉన్నాడు.

నీడలా నేహను వెంటాడటం మొదలుపెట్టాడు.

సుహాస్ మొండితనం నేహకు భరింపశక్యంగా లేదు.

ఆ రోజు నేహ పుట్టినరోజు.

కొద్దిమంది స్నేహితులకు మాత్రమే పార్టీ ఇచ్చింది నేహ. సడెన్‌గా అక్కడ ప్రత్యక్షం అయ్యాడు సుహాస్.

"నా పుట్టిన రోజని నీకెలా తెలుసు?" ఆశ్చర్యంలో తలమునకలవుతూ ప్రశ్నించింది నేహ.

"అది నా గొప్పతనం కాదు. ప్రేమ గొప్పతనం" చిన్నగా చెప్పి డైమండ్ రింగ్ ప్రెజెంట్ చేశాడు.

ఫ్రెండ్స్ ముందర రభస ఇష్టం లేక అయిష్టంగానే దాన్ని తీసుకుంది నేహ.

అది తన మొదటి విజయంగా భావించేడు సుహాస్. ఇహ నేహను అనుసరించటమే పనిగా పెట్టుకున్నాడు.

ప్రతి చిన్న అకేషన్‌కి నేహకు గ్రీటింగ్స్ పంపిస్తున్నాడు.

సుహాస్ వేధింపులు తట్టుకోలేక ఓరోజు అతన్ని ఒంటరిగా కలిసింది నేహ.

తన ప్రేమను అంగీకరిస్తుందన్న కొండంత ఆశతో వచ్చేడు సుహాస్.

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు నా వెంట పడవద్దని. అరే! నువ్వంటే నాకిష్టం లేదని చెప్పానుగా. అయినా ఎందుకిలా గ్రీటింగ్స్ అవీ పంపిస్తావు? ఆఖరుసారి చెప్తున్నాను, ఇహ నుంచి నన్ను ఫాలో చెయ్యొద్దు. ఇంతలా వేధిస్తున్న నిన్ను నేను ఎప్పటికీ ప్రేమించను" అతనిచ్చిన గిఫ్టులు, గ్రీటింగ్స్ విసిరికొడుతూ చెప్పింది నేహ.

హతాశుడయ్యాడు సుహాస్.

"ఎందుకు నీకు నామీద ప్రేమ కలగడం లేదు?" దీనంగా అడిగాడు.

"ఏ అమ్మాయికయినా నీ మీద ప్రేమ ఎలా కలుగుతుంది చెప్పు? ఎంతసేపూ నీ ధోరణి నీదే తప్ప నా అభిప్రాయానికి ఎప్పుడయినా విలువిచ్చావా? నీకిష్టం అయితే సరిపోతుందా? నాక్కూడా నీమీద ఇష్టం ఉండాలిగా. ప్రేమంటే రెండు హృదయాలలో ఒకేసారి కలగాలి. నీపాటికి నువ్వు ప్రేమించేసి నన్ను కూడా బలవంతం చేయటం ప్రేమ కాదు"

"అమ్మాయిలంతా మొదట్లో ఇలాగే ఉంటారు. నీ పట్టు వదలకు. ప్రేమదే జయం" సుహాస్‌కు చెప్పారు ఫ్రెండ్స్.

సుహాస్‌లో పట్టుదల మరింత అధికమయ్యింది.

నేహకు వేధింపులు మరింత ఎక్కువయ్యాయి.

కాలేజీకెళ్లినా, ఏ పనిమీద బయటకు వచ్చినా నీడలా అనుసరిస్తున్నాడు సుహాస్.

చదువుమీద ఏకాగ్రత లోపించింది.

"ఎందుకు విలువయిన కాలాన్ని వృథా చేస్తున్నావు? ఈ వయసులో ప్రతిక్షణం విలువయినది. పోతే తిరిగి రాదు. ఇద్దరి చదువులు దెబ్బతినటం తప్ప ఈ ప్రేమతో ఏం బావుకుంటాం?" నడిరోడ్డు మీదే నిలదీసింది ఒకరోజు.

"నిజమే చదువుఎలానూ సాగేట్టు లేదు. కనీసం నన్ను ప్రేమలోనయినా గెలవనీ" అన్నాడు సుహాస్.

"కుదరదు"

"అదే ఎందుకు కుదరదూ అని?" పంతంగా అన్నాడు సుహాస్.

"నీ ఇష్టాన్ని బలవంతంగా అయినా నామీద రుద్దాలని ప్రయత్నించే నీ మనస్తత్వం నాకు నచ్చలేదు. నీ మూలంగా నేనెంత బాధపడ్తున్నదీ గ్రహించలేని నీ స్వార్థం కూడా నాకు నచ్చలేదు. నిన్ను నేను ఎప్పటికీ ప్రేమించలేను. దయచేసి నన్ను వదిలెయ్యి" ప్రాధేయపూర్వకంగా అంది నేహ.

ఆమె వేడుకోలు సుహాస్ మనసుని మార్చలేకపోయింది.

ooo


నేహను చూసి సంవత్సరం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చాడు సుహాస్.

"సంవత్సరం గడిచినా ఇంకా నో ప్రోగ్రెస్. వెరీ బాడ్!" పెదవి విరుస్తూ అన్నాడు సుహాస్ మిత్రబృందంలోని రాహుల్.

మరొకసారి అవమానంతో దహించుకుపోయాడు సుహాస్.

తరువాత రెండు వారాలకే మరొక షాకింగ్ న్యూస్ తెలిసింది అతనికి. నేహ వాళ్ళ ఫాదర్‌కు వేరొక ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యిందని, మరొక రెండు నెలల్లో నేహ కూడా తండ్రితో అక్కడి నుంచి వెళ్లిపోతుందని తెలిసింది.

ఒక్కసారిగా తన ప్రేమ సౌధం తునాతునకలైపోయినట్టు అనిపించింది సుహాస్‌కు.



నేహ మటుకు హాయిగా ఊపిరి పీల్చుకుంది.

త్వరలో సుహాస్ పీడ విరగడ అవుతున్నందుకు సంతోషించింది.

సుహాస్ వేధింపులు తల్లిదండ్రులకు చెప్పలేక ఎంతో క్షోభ అనుభవించింది ఇంతకాలం.

తల్లిదండ్రులకు తెలిస్తే ఎక్కడ తనదే తప్పు అనుకుంటారోనన్న భయంతో విషయం వాళ్లకు తెలియకుండా దాచింది.

ప్రశాంతంగా ఉన్న నేహకు తెలియదు సుహాస్ తనను ఒంటరిగా కలుసుకునే అవకాశం కోసం కాచుకుని ఉన్నాడని.

ఆ అవకాశం సుహాస్‌కు వేలంటైన్స్ రోజున దొరికింది.

ప్రేమికుల రోజున నేహను ఒంటరిగా కలుసుకునే అవకాశం రావటం శుభసూచకంగా భావించేడు సుహాస్.

ఒంటరిగా వస్తున్న తనను దారి కాచి అటకాయించిన సుహాస్‌ని మనస్సులోనే తిట్టుకుంది నేహ. పదిమంది ముందు అల్లరిపాలవుతానన్న భయంతో సుహాస్‌తో పార్కుకి నడిచింది.

పార్కులో తనకు తెలిసినవారు ఎవరూ లేకపోవటంతో తేలిగ్గా నిట్టూర్చింది.

"సుహాస్ ఏమిటీ అఘాయిత్యం? ఇలా అయితే విషయం పెద్దవాళ్లకు చెప్పాల్సి వస్తుంది" సీరియస్‌గా అంది.

నేహ సీరియస్‌నెస్‌ని అస్సలు పట్టించుకోలేదు సుహాస్.

"ప్లీజ్ నేహా! ఒక్కసారి నన్ను ప్రేమిస్తున్నానని చెప్పు. నువ్వంటే నాకెంత ప్రేమో నీకు తెలియదు"

ఉన్మాదిలా ఉన్న అతనిని కంపరంగా చూసింది నేహ.

ఎంత నచ్చజెప్పినా వినకుండా వేధిస్తున్న సుహాస్‌ని చూస్తుంటే విపరీతమయిన ఆగ్రహం కలిగింది.

ఎంత కాలంగానో అణిచిపెట్టుకున్న క్షోభ కన్నీళ్ల రూపంలో బయటకు వచ్చింది. కసిగా సుహాస్ చెంప పగలగొట్టి అక్కడినుండి వచ్చేసింది.

శిలావిగ్రహంలా ఉండిపోయాడు సుహాస్.

ప్రతీకారంతో రగిలిపోయాడు.

నేహ ఎలాగూ తనకు దక్కదు. తనకు దక్కని ఆమె భూమి మీద ఉండకూడదు. అందుకే చాలా రోజులు ఆలోచించి ఓ పథకం రచించాడు.

దబ్బు వెదజల్లి తనకు కావాల్సిన దానిని సంపాదించాడు.

తన ముందున్న యాసిడ్ బాటిల్‌ని, పదునయిన కత్తిని మార్చి మార్చి చూశాడు సుహాస్. దేనిని ఉపయోగించి నేహ మీద పగ తీర్చుకోవాలా అన్న ఆలోచనలో ఉన్నాడు అతను.

ప్రిపరేషన్ హాలిడేస్ కావటంతో నేహ బయటకు రావటం లేదు.

ఎప్పుడు బయట కనిపిస్తుందా, ఎప్పుడు పగ సాధిద్దామా అన్న ద్వేషంతో రగిలిపోతున్నాడు సుహాస్.

అలాంటి తరుణంలో వచ్చింది రూప తండ్రితో కలిసి సుహాస్ ఇంటికి. రూప సుహాస్‌కు మేనమామ కూతురు.

పద్దెనిమిదేళ్ల రూప ఇంటర్‌తో చదువు ఆపేసింది.

ఆ సమయంలో రూప రాక ఎక్కడలేని చిరాకుని కలిగించింది సుహాస్‌కు.

అసలు రూప పొడే గిట్టదు అతనికి. అలాంటిది వారం రోజులయినా వాళ్లు తిరిగి వెళ్లకపోవటం ఆ చిరాకుని మరింత పెంచింది.

మరొకపక్క నేహ అస్సలు బయట కనిపించటం లేదు.

నేహ వెళ్లిపోయేలోగా తన ప్రతీకారం తీరదేమోనన్న భయం మొదలయ్యింది సుహాస్‌లో.

సుహాస్ ఆలోచనలతో నిమిత్తం లేనట్టుగా రూప అక్కడే తిష్ట వేసింది. సుహాస్ ఇంట్లో ఉంటే అతని చుట్టే తిరుగుతుంటుంది రూప.

"అమ్మా మావయ్యా వాళ్లు ఎప్పుడు వెళ్లిపోతారు?" ఓ రోజు తల్లిని అడగనే అడిగేశాడు సుహాస్.

"అదేమిటి అలా అంటావు?" నొచ్చుకున్నట్టు అందావిడ.

"అవునమ్మా వాళ్లు ఇక్కడ ఉండటం నాకు నచ్చటం లేదు"

ఒక్కక్షణం సుహాస్‌నే నిశితంగా చూసి చెప్పింది అతని తల్లి "రూపకు నువ్వంటే ప్రాణం. నీ మాటలు వింటే తను బాధపడుతుంది. అసలు మావయ్య ఎందుకు వచ్చాడో తెలుసా?"

తల్లి మాటలకు అయిష్టంగా మొహం పెట్టాడు సుహాస్. రూప పట్ల గల అయిష్టం స్పష్టంగా తెలిసిపోతోంది అతని కళ్లల్లో.

సుహాస్ అయిష్టాన్ని గమనించనట్టుగా తిరిగి మొదలు పెట్టింది అతని తల్లి. "మావయ్య వచ్చింది రూపను నీకు చేసుకోమని అడగటానికి. మావయ్యకు ఒక్కత్తే కూతురు. బోలెడంత ఆస్తి. రూప కూడా బాగానే ఉంటుంది. అందుకే ఈ సంబంధం మాకు అన్ని విధాలా నచ్చింది"

"అమ్మా! ఇక చాలు ఆపు" బిగ్గరగా అన్నాడు సుహాస్.

రూపతో పెళ్లి అన్నమాట కంపరంగా అనిపించింది అతనికి. "అమ్మా! రూప ప్రస్తావన నా దగ్గర ఇంకెప్పుడూ తీసుకురావద్దు. తనంటే నాకు ఇష్టం లేదు"

ఇంకా ఏదో అనబోతున్న సుహాస్‌ని వారించింది అతని తల్లి. "గట్టిగా మాట్లాడకు సుహాస్. రూప ఇంట్లోనే ఉంది. తను వింటే బాధపడుతుంది"

"అవసరం లేదత్తయ్యా నేనంతా విన్నాను" చిన్నబోయిన వదనంతో వారి ఎదుట నిలిచింది రూప.

మొహమంతా ఎర్రగా అయిపోయింది రూపకు. కళ్లు కన్నీటి చెలమలే అయ్యాయి.

."ఏం బావా? నేనంటే ఎందుకు ఇష్టంలేదో తెలుసుకో వచ్చా?"

రూప ప్రశ్నకు సమాధానం చెప్పటం ఇష్టం లేనట్టుగా మౌనంగా ఉండిపోయాడు సుహాస్.

"ఏరా అడుగుతుంటే సమాధానం చెప్పవేంటి? అది చదువు ఆపేసిందని నీకిష్టం లేదా? నీక్కావలసినంత చదివిస్తానంటున్నాడు మావయ్య. నువ్వంటే రూపకు ప్రాణంరా. పాపం ఆ పిల్ల మనసు నొప్పించకు" కల్పించుకుని అంది సుహాస్ తల్లి.

"తనకు ఇష్టమయితే సరిపోయిందా? నాక్కూడా ఇష్టం ఉండాలిగా?" అరిచినట్టు చెప్పాడు సుహాస్.

"నిన్ను ప్రాణాధికంగా ప్రేమించిన అమ్మాయిని తక్కువ చేసి మాట్లాడకు. నీకు తెలుసా, రూప నీమీద ప్రేమతో ఎంతో మంచి సంబంధాన్ని వదులుకుంది" కోపంగా చెప్పింది సుహాస్ తల్లి.

"బాగుంది! తన పాటికి తను నన్ను ప్రేమించింది కాబట్టి నేను కూడా తనను ఇష్టపడాలా?"

వాళ్లు జవాబు చెప్పలేని ప్రశ్న వేశాడుగానీ మనసులో ఏదో గుచ్చుకున్నట్టుగా ఫీలయ్యాడు సుహాస్.

ఇదే ప్రశ్న కొంతకాలం క్రితం నేహ తనను అడిగినట్టు గుర్తొచ్చింది అతనికి. తరువాత పెద్ద రభస జరిగింది ఆ ఇంట్లో.

ఎవరెన్ని చెప్పినా రూపను చేసుకోవటానికి అంగీకరించలేదు సుహాస్.

సుహాస్‌తో కఠినంగా వ్యవహరించాలనుకున్న అతని తల్లిదండ్రులను రూపే వారించింది.

"ఎవరితోనయినా ఇష్టంలేని పనిచేయించటం అంత అమానుషత్వం మరొకటి ఉండదు. ఇష్టంలేని పెళ్లి ఎంత నరకమో నాకు తెలుసు. నాకు నచ్చింది కాబట్టి ఇంకొకరిని కూడా ఇష్టపడమనటం మానవత్వం అనిపించుకోదు"

చిన్నదయినా, రూప మంచితనానికి అందరూ ప్రశంసాపూర్వకంగా చూశారు.

వెళ్లేముందు రూప సుహాస్ దగ్గరకు వచ్చింది. "బావా నిన్ను ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించు. నా గురించి నువ్వేమీ బాధపడకు. నా మనసు కుదుట పడ్డ తరువాత వచ్చిన అబ్బాయిని పెళ్లి చేసుకుంటాను. సెలవు"

రూప వెళ్లిపోయేక తిరిగి ఆ ఇంట్లో ప్రశాంతత నెలకొంది.

ooo

ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాడు సుహాస్.

అతని మనసులో ఏదో సంఘర్షణ.

రూప ఉదంతం అతనిని బాగా ప్రభావితం చేసింది. తనకిష్టం లేదని తెలియగానే, రూప తన మనసు మార్చుకుంది.

మరి తనేం చేశాడు? నేహను ఎంతగానో వేధించాడు. తను ఇష్టపడ్డాడు కాబట్టి ఆమెను కూడా ప్రేమించమని ఒత్తిడి చేశాడు.

ప్రేమంటే రెండు హృదయాలలో ఒకే స్పందన కలగటం అన్న విషయాన్ని విస్మరించాడు.

తను మాత్రమే ప్రేమించి ఆమెను కూడా ప్రేమించమని బలవంతం చెయ్యటం ఎంత రాక్షసత్వం!

ఇష్టంలేని ఐటంతో ఒక్కపూట కూడా భోజనం చెయ్యలేము. నచ్చని డ్రెస్ ఒక్కరోజు కూడా వేసుకోవాలనిపించదు.

అలాంటిది నేహను అంతగా ఒత్తిడి చేయటం ఎంత అమానుషం?

అసలు ఆమెను ఒత్తిడి చేసే అధికారం తనకెక్కడిది?

ఒక్కక్షణం నేహమీద తను ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న విషయం గుర్తుకొచ్చి ఒళ్లు జలదరించింది.

కొద్దిలో ఎంత ప్రమాదం తప్పిపోయింది.

అసలు నేహ ఏ తప్పు చేసిందని ఆమె మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు! తనదసలు ప్రేమేనా? తనది నిజమయిన ప్రేమే అయితే ప్రేమించిన అమ్మాయి సుఖం మాత్రమే కోరుకునేవాడు. కానీ తను యాసిడ్ పోసి వికృతంగా చెయ్యాలనో, చంపాలనో అనుకున్నాడు. తనది నిజమయిన ప్రేమ కాదు. అంతా అభిజాత్యం. తనదే నిజమయిన ప్రేమ కానప్పుడు, ఇహ నేహను ప్రేమించమని అడిగే అర్హత తనకు ఎక్కడిది? అసలు నేహకు సంబంధించి ఓ నిర్ణయం తీసుకునే అధికారం తనకు ఎవరిచ్చారు? ప్రేమించటం తప్పు కాదు. ప్రేమించబడాలనుకోవడం కూడా తప్పు కాదు. కానీ, ఇష్టం లేకపోయినా ఒత్తిడి చేయటం, పగ పెంచుకోవటమే తప్పు.

రూప చూపిన బాట అతనిలో అంతర్మథనానికి దారి తీసింది.

ఓ చిన్న ఆత్మవిమర్శ ఎన్నో విలువయిన పాఠాలు నేర్పింది. రెండు నిండు జీవితాలు నాశనం కాకుండా చేసింది. అతని జీవన గతినే మార్చివేసింది.

పశ్చాత్తాపం సుహాస్ కళ్ల వెంట కన్నీరులా వెలువడింది.

మర్నాడే నేహను కలిసి క్షమార్పణ వేడుకున్నాడు.

"నన్ను క్షమించు నేహా! అన్యాయంగా నిన్ను ఎంతగానో వేధించాను. అందుకు నేనెంతో బాధపడ్తున్నాను. ఇంకెప్పుడూ నీకు కనిపించను. నొప్పించను" తలవంచుకుని సెలవు తీసుకున్నాడు.

సుహాస్‌లో ఆకస్మిక మార్పుకు కారణం తెలియక అలాగే ఉండిపోయింది నేహ. ఆమె కనుకొనల వెంట ఓ కన్నీటి చుక్క ముత్యమై ప్రకాశించింది.

కాలగర్భంలో ఎనిమిది సంవత్సరాలు కలిసిపోయాయి.

ఇప్పుడు సుహాస్ పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

ప్రేమ విఫలమయ్యేక పూర్తిగా చదువుకే అంకితమయ్యాడు సుహాస్.

నేహకు సంబంధించిన వివరాలు ఏవీ అతనికి తెలియవు.

ఫోన్ రింగ్ అవుతుంటే లిఫ్ట్ చేశాడు సుహాస్.

ఫోన్‌లో వినవచ్చిన తియ్యటి గొంతుకు అతనిలో ఏవో జ్ఞాపకాల తడి. ఏదో పరిమళం తనను నిలువెల్లా తడుముతున్న భావన.

"ఏయ్ సుహాస్! నేను నేహను"

నేహ, స్వరం, పేరు వినగానే సుహాస్‌లో ఏవేవో పులకింతలు.

ఇది నిజమేనా అన్న అపనమ్మకం!

"సుహాస్! నీకోసం ఎంతకాలం నుంచి వెతుకుతున్నానో తెలుసా! నువ్వలా ఆ రోజు సారీ చెప్పేసి వెళ్లిపోయేక నిన్ను తలుచుకుని నేను కూడా చాలా బాధపడ్డాను. నీకు దూరంగా ఉన్నానన్న మాటేగానీ, అనుక్షణం నీ జ్ఞాపకాలే"

నేహ మాటలతో చెవుల్లో అమృతం పోసినట్టుగా అనిపించింది సుహాస్‌కు.

"ఏయ్ మొద్దబ్బాయి! ఇంకా అర్థం కాలేదా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

సుహాస్ ఒకప్పుడు ఏ మాటను వినాలని తపించిపోయాడో, ఆ మాటను ఒళ్లంతా చెవులు చేసుకుని మరీ విన్నాడు.

రెండక్షరాల ప్రేమలో అమృతత్వం ఇమిడి ఉంది.

అంతటి అమృతమయమయిన ప్రేమ మరింత ప్రేమను పంచుతుందేగాని, రాక్షసత్వానికి మారురూపంలా వేధించదు, హింసించదు.

ప్రేమ, పువ్వు తనంతట తాను ఎలా వికసిస్తుందో అలా సహజంగా కలగాలి.

మహోన్నతమయిన ప్రేమను వేధించి, హింసించి పొందలేము.

'ప్రేమను మాత్రమే పంచేది ప్రేమ' ప్రేమ పారవశ్యంలో సుహాస్ మది పలికిన పలుకులివి.

O